

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154



రీచ్ నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్

కొత్త కష్టం..!

ఉచిత ఇసుకకు కటకట

రోజుల తరబడి వేచి ఉండాల్సిందే..

ఆగిపోతున్న భవన నిర్మాణాలు

జోరందుకున్న స్థానిక ఇసుక వ్యాపారం

అధికార పార్టీ కార్యకర్తల దందా



కదిరి, సెప్టెంబరు 16: కూటమి పాలనలో ఇసుకకు కొత్త కష్టం వచ్చి పడింది. గత వైసీపీ పాలనలో ఇసుక ధర విపరీతంగా పెంచేయడంతో చాలా నిర్మాణాలు ఆగిపోయాయి. కొత్త నిర్మాణాల ఆలోచనను పలువురు వాయిదా వేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీంతో బిల్డర్లు, భవన యజమానులు హర్షం వ్యక్తం చేశారు. స్థిరాస్తి రంగం ఊపందుకుంటుందనుకున్నారు. ఇసుక రూపంలో కొత్త కష్టం వచ్చిపడింది. ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తున్నా.. రీచ్‌లు లేక తీవ్ర కొరత ఏర్పడుతోంది. ఒక రీచ్ నుంచి ఇసుక రావాలంటే రోజుల సమయం పడుతోంది. దీంతో బిల్డర్లు, భవన యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. దీనిని ఆసరాగా చేసుకుని, అధికార పార్టీ వర్గీయులు ఇసుక దందాకు తెరలేపారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. స్థానికంగా వాగులు, వంకల్లో దొరికే ఇసుకను అధిక ధరకు అంటగడుతున్నారు. కదిరిలో అయితే.. ఇద్దరు అధికార పార్టీ కార్యకర్తలు తమ వద్దే ఇసుక కొనుగోలు చేయాలంటూ బిల్డర్లు, భవన యజమానులకు హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. దీంతో బిల్డర్లు ఆందోళన చెందుతున్నారు.

జాడలేని ఉచిత ఇసుక

ఉచిత ఇసుక వస్తుందని, నిర్మాణాలు వేగవంతమవుతాయని ప్రజలందరూ ఆశించారు. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక పంపిణీని ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారు. వారం రోజులకే స్టాక్ పాయింట్ ఖాళీ అయింది. ప్రస్తుతం ఇసుక ఎక్కడా లేదు. ముదిగుబ్బ మండలంలోని కొండవండ్లపల్లి రీచ్‌లో మాత్రమే లభిస్తోంది. వందలాది టిప్పర్లు మూడు నియోజకవర్గాల నుంచి వెళ్తుండడంతో లోడింగ్‌కు మూడు రోజులు పడుతున్నట్లు సమాచారం. అదికూడా పది టన్నులు మాత్రమే ఇస్తున్నారు. దీంతో ఇసుకకు ఒబ్బందులు పడాల్సి వస్తోందని వాహన యజమానులు వాపోతున్నారు.

ఆగిపోతున్న భవన నిర్మాణాలు

ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణాలు ఆగిపోతున్నాయి. అరకొర ఇసుక ఏమూలకు సరిపోవడంలేదని బిల్డర్లు వాపోతున్నారు. దీంతో ఇటు బిల్డర్లకు.. అటు భవన యజమానులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా దొరికే ఇసుక నాణ్యతగా లేకపోవడంతో కొనుగోలు చేయడానికి యజమానులు ముందుకు రావడంలేదు. ఇసుక సరఫరాలేక, స్థానిక ఇసుక నాణ్యతగాలేక నిర్మాణ రంగం కుదేలవుతోంది. దీనిపై ఆధారపడిన కార్మికులు పనులులేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రోజులు గడిచే కొద్దీ నిర్మాణ వ్యయంకూడా పెరుగుతోంది.

మా వద్దే కొనుగోలు చేయాలి

కదిరి పట్టణంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు, మిగిలిన ట్రాక్టర్ యజమానులను సిండికేట్ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక, ఇటుక తమవద్దే కొనుగోలు చేయాలని బిల్డర్లు, భవన యజమానులకు హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవలే కదిరి పట్టణంలో ఓ ఇంటి యజమాని ధర్మవరం నుంచి ఇటుకను తెప్పించుకున్నాడు. దీనిపై ఆగ్రహించిన అధికార పార్టీ కార్యకర్తలు.. ఆ భవన యజమానిపై జులుం ప్రదర్శించినట్లు సమాచారం. ఇసుక, ఇటుక తమ వద్దే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. కొండవండ్లపల్లి ఇసుక ట్రాక్టర్లను కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్దే అడ్డుకుని, వెనక్కు పంపిన ఘటనలు కోకొల్లలు. భవన నిర్మాణంలో నాణ్యమైన ఇసుక ఎంతో అవసరం. స్థానికంగా లభించే ఇసుక నాణ్యత లేకపోవడంతో నిర్మాణ యజమానులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. అధికార పార్టీ కార్యకర్తలు.. తమ వద్దే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేయడంతో తప్పని పరిస్థితిలో కొంత మంది కొంటున్నట్లు సమాచారం. మరికొంతమంది నిర్మాణాలు నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది.

ఒకటే రీచ్

భవన నిర్మాణాలకు ఇసుక ముఖ్యం. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుకతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటవగానే ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. మొట్టమొదటగా స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను టన్ను రూ.275కే అందించారు. స్టాక్‌పాయింట్లలో ఇసుక వారంరోజులకే ఖాళీ అయిపోయింది. అప్పటి నుంచి ఉచిత ఇసుక జాడ కనిపించలేదు. రీచ్‌లలో ఇసుక కొనుగోళ్లు కూడా మందకొడిగా సాగుతున్నాయి. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోకవర్గాలకు ఏకైక రీచ్ ముదిగుబ్బ మండలంలోని కొండవండ్లపల్లిలో ఉంది. ఈ రీచ్ నుంచి ఇసుక రావడానికి అధిక సమయం పడుతోంది. రోజుకు పది టన్నుల ఇసుక మాత్రమే ఇస్తున్నారు. దీంతో టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులు ఇసుక కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకుని, స్థానికంగా ఉన్న వంకలు, వాగుల్లో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేసుకుని, ట్రాక్టర్ రూ.4 వేలతో అమ్ముతున్నట్లు తెలిసింది. రీచ్‌ల నుంచి ఇసుక రాకపోవడంతో స్థానిక ఇసుక నాణ్యత లేకున్నా, భవన నిర్మాణాలు మధ్యలో ఉన్న యజమానులు దానినే కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఇసుక అధిక ధరలతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రస్తుతం ఇసుక దొరక్క ఆగిపోతున్నట్లు తెలుస్తోంది.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం. కదిరి ప్రాంతంలో స్థానికంగా కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి, ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం కొత్తపాలసీ తీసుకు వచ్చింది. త్వరలోనే దానిని అమలు పరుస్తాం. పోలీసులు, రెవెన్యూ శాఖ సహకారంతో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తాం.

- రామమోహన్‌రావు, ఏడీ, గనుల శాఖ

కంకర మిషన్‌కు రూ.12.90కోట్ల జరిమానా

వైసీపీ నాయకుడి అక్రమ తవ్వకాలపై చర్యలు



కంకర మిషన్‌లో తనిఖీలు చేస్తున్న గనుల శాఖ అధికారులు

కదిరి, సెప్టెంబరు 16: పట్టణ సమీపంలో వైసీపీ నాయకుడు ప్రణీత్‌రెడ్డి నిర్వహిస్తున్న శివసాయి కంకర మిషన్‌ను గనుల శాఖాధికారులు సీజ్ చేసి, రూ.12.90కోట్ల జరిమానా విధించారు. గనుల శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) రామమోహన్‌రావు సోమవారం ఆ వివరాలు వెల్లడించారు. అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు రావడంతో శివసాయి కంకర్ మిషన్‌లో అధికారులు నెలరోజుల క్రితం తనిఖీలు చేశారు. అనుమతి పొందినదానికన్నా ఎక్కువగా మైనింగ్ చేయడం, పక్క భూములను అక్రమించడం లాంటి అక్రమాలను గుర్తించారు. యజమాని ప్రణీత్ రెడ్డికి నోటీసులు కూడా ఇచ్చారు. అయినా మార్పు రాకపోవడంతో గత రెండ్రోజులుగా మరోసారి కంకర మిషన్‌లో తనిఖీలు చేపట్టారు. అక్రమాలను నిర్ధారించుకున్నారు. 1.94 లక్షల క్యూబిక్ మీటర్లలో తవ్వకాలకు అనుమతి ఇవ్వగా.. అధిక విస్తీర్ణంలో తవ్వకాలు చేపట్టినట్లు గుర్తించారు. ఇందుకు రూ.1.74 కోట్లు సాధారణ ఫీజు కాగా.. నిబంధనలు అతిక్రమించినందుకు రూ.8.74 కోట్ల జరిమానా విధించారు. మరో ప్రాంతంలో 600 క్యూబిక్ మీటర్లు మైనింగ్ చేసినందుకు రూ.6.65 లక్షలు జరిమానా, పన్నులు, అన్ని చార్జీలు కలిపి రూ.12.90 కోట్లు అయిందని ఏడీ వివరించారు. 15 రోజుల్లోగా మొత్తం చెల్లించాలనీ, ఆ తరువాతే కంకర మిషన్‌కు అనుమతులు వస్తాయన్నారు. కంకర మిషన్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తుండగా భూభాగాన్ని గుర్తించడానికి స్థానిక వీఆర్వో నరసింహారెడ్డి రావాలని పలుమార్లు చెప్పినా, ఆయన ముఖం చాటేసినట్లు సమాచారం.

ఇరువర్గాలపై కేసు

బత్తలపల్లి, సెప్టెంబరు 16 : మండలంలోని వెంకటగారిపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన మొత్తం 26 మందిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆ గ్రామంలో స్థల వివాదంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు ఘర్షణ పడ్డారు. ఇందులో వైసీపీకి చెందిన అరవిందు, శ్రీనివాసులు, నరేష్, వెంకటరాముడు, అప్పస్వామినాయుడు, గంగానాయుడు, టీడీపీకి చెందిన లక్ష్మీనారాయణ, అభిలాష్, మధు, రామాంజనేయులు, సుధాకర్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచి, వైసీపీకి చెందిన నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 16 : మండలంలోని వీరజిన్నయ్యపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓడీసీకి చెందిన డ్రైవర్ అశోక్ కుమార్ (23) మరణించాడు. సోమవారం సాయంత్రం అతను రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు పుట్టపర్తిలో రిపేరు చేయించుకుని బొలెరో వాహనంలో వాటిని తీసుకొని ఓడీసీకి బయలుదేరాడు. వీరాంజనేయపల్లి సమీపంలో వెంగళమ్మచెరువు నుంచి ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి బొలెరో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీ కొన్నాడు. ఈ ఘటనలో డ్రైవర్ అశోక్ అక్కడికక్కడే మరణించాడు. బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న తిరుపాల్ తీవ్రంగా... సునీల్‌కుమార్, రామకృష్ణ స్వల్పంగా.. గాయపడ్డారు. వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నారు. అశోక్ మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అశోక్‌కు భార్య, సంవత్సరం వయసుగల కుమార్తె ఉన్నారు.



చెట్టును ఢీకొన్న బొలెరో వాహనం

ఇక అంతా స్మార్ట్

త్వరలో ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు

వాడుకున్న వారికి వాడుకున్నంత చార్జీ

పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ కార్యాలయాలకు..



స్మార్ట్ మీటరు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 16: నూతన ఒరవడితో నాణ్యమైన విద్యుత్ అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేయబోతుంది. ఈక్రమంలోనే త్వరలో ఇళ్లకు స్మార్ట్ మీటర్లు అమర్చనున్నారు. ఇప్పుడు ఫోన్లు, టీవీలకు ముందుగా రీచార్జ్ చేసుకొని ఎలా వినియోగించుకుంటున్నామో అదేవిధంగా విద్యుత్ అవసరాలకు కూడా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రీపెయిడ్ రీచార్జీ చేసుకోవాల్సి ఉంటుంది. ఎవరెవరి అవసరాల మేరకు వారు రీచార్జ్ చేసుకోవచ్చు. ఈ విధానంతో ప్రతి ఒక్కరు విద్యుత్ పొదుపును అలవర్చుకుంటారు. ఏ పరికరం ఎక్కువగా వాడితే ఎంత కరెంటు ఖర్చు అవుతుందో వినియోగదారుడికి అవగాహన వస్తుంది. దీంతో ఏ వస్తువును ఎక్కువగా వాడాలి, ఏ పరికరం తక్కువగా వాడాలి అనే అవగాహన వస్తుంది. విద్యుత్ వాడితేనే డబ్బు ఖర్చు అవుతుంది. ఉదాహరణకు ఒక వారం, పది రోజులు ఇళ్లకు తాళం వేసి ఏదైనా టూర్ వెళ్తే వాడకం ఉండదు. దీంతో కరెంటు ఖర్చు మిగులుతుంది. ఇప్పుడు అయితే వాడినా వాడకపో యినా తప్పని సరిగా బిల్లు కట్టాల్సి ఉంటుంది. కానీస్మార్ట్ మీటర్లు వచ్చిన తరువాత అలా ఉండదు. అంతే కాకుండా ఒక ప్రాంతంలో కరెంటు ఎప్పుడు పోయింది. ఎప్పుడు వచ్చింది. ఎంత సేపు పోయింది తదితర విషయాలు సిస్టమ్‌లో తెలిసిపోతాయి. వినియోగదారులు కరెంటు లేదని ఫిర్యాదు చేయనవసరం లేదు. అలాంటప్పుడు తగు విధంగా చర్యలు తీసుకుంటారు. ఇకపై డీసీ లిస్టు(డిస్ కనెక్షన్ లిస్టు) ఉండదు. నెల నెల లైన్‌మన్‌లు వచ్చి మీరు కరెంటు బిల్లు కట్టలేదు. కట్టండి లేదా కనెక్షన్ తీసివేస్తామని చెప్పనవసరం ఉండదు. రీచార్జ్ డబ్బులు అయిపోతే ఫోన్‌లు ఎలా మూగబోతాయో కరెంటు కూడా అంతే. అంతకుముందే మీరు వినియోగిస్తున్న కరెంటు యూనిట్లు త్వరలో అయిపోనున్నాయి. రీచార్జు చేసుకొండని ఫోన్‌కు సమాచారం అందుతుంది. దీంతో వినియోగదారుడు జాగ్రత్త పడతాడు. ఇదే క్రమంలో ట్రాన్స్‌కోలో మ్యాన్ పవర్ తగ్గిపోతుంది. ఉన్న సిబ్బంది నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తారు. స్మార్ట్ మీటర్ల డిస్‌ప్లేలో ఎంత రీచార్జు చేశాము. ఎంత వినియోగించాలి, ఎంత వినియోగించాము ఇంకా ఎంత వాడుకోవచ్చు అని కనిపిస్తుంది. మరో ఆరు నెలల్లో అన్ని ఇళ్లు, దుకాణాలు, కంపెనీలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

మొండిబకాయిలు ఉండవు

ఇప్పుడు విద్యుత్ మొండి బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఇవి ఎక్కువగా ఉన్నాయి. చాలా సార్లు కార్యాలయాలకు విద్యుత్ కనెక్షన్‌లు కట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. స్మార్ట్ మీటర్ల విధానం అమలైతే అలాంటి అవసరం ఉండదు. మొండి బకాయిలు ఉండవు. వారు కూడా అవసరం మేరకు రీచార్జు చేసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే విద్యుత్ సరఫరా ఉండదు. తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లోనే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. తరువాత ఇళ్లకు, కేటగిరి-2 షాపులకు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో 89525 ప్రభుత్వ కార్యాలయాల కనెక్షన్‌లు ఉన్నాయి. రెండు నెలల్లో వాటన్నింటికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. హిందూపురంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఏపీ ఫైబర్‌నెట్ వారికి స్మార్ట్ మీటర్ కనెక్షన్ ఇచ్చారు.

పొదుపు నేర్చుకుంటారు: భూపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

స్మార్ట్‌మీటర్ల విధానంతో ఏ సమయంలో విద్యుత్ ఎక్కువ వాడుతున్నారో అర్థం చేసుకొని, ప్రజలు పొదుపు నేర్చుకుంటారు. విద్యుత పొదుపు అలవాటుగా మారుతుంది. ప్రజలకు ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

హాస్టల్‌లో పరిశుభ్రత పాటించండి

- మంత్రి సవిత



హాస్టల్‌లో కూరను పరిశీలిస్తున్న మంత్రి

కొత్తచెరువు, సెప్టెంబరు 16: వసతిగృహం లో పరిశుభ్రత పాటించాలని బీసీ సంక్షేమ, చేనేతజౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పుట్టపర్తి ర హదారి పక్కన అద్దెభవనంలో కొనసాగుతున్న బీ సీ బాలికల వసతి గృహా న్ని సోమవారం మంత్రి సవిత తనిఖీ చేశారు. వంటగదికి వెళ్లి భోజనం, కూరలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భో జనం అందించాలని సిబ్బందికి సూచించారు. వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులున్నారు, ఈ గదులు సరిపోతాయా, నూతన భవన నిర్మాణంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలికల బీసీ వసతి గృహాన్ని ప్రభుత్వాస్పత్రి వెనుక భాగాన కొండకు ఆనుకుని నిర్మించారు. అక్కడ బాలికలకు రక్షణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దానికి మరమ్మతులు చేసి మండల కేంద్రంలోనే ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని అందులోకి మార్చాలని మంత్రిని స్థానికులు కోరారు. ప్రస్తుతం ఉన్న బాలుర వసతిగృహాన్ని బాలికలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



హిందూపురంలో మక్కా, మదీనా నమూనాను ఊరేగిస్తున్న ముస్లింలు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 16: జిల్లావ్యాప్తంగా సోమవారం మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాంతి ర్యాలీలు చేపట్టారు. హిందూపురంలోని మసీదుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని మతపెద్దలు బోధించారు. మక్కా, మదీనా నమూనాలతో ర్యాలీలు చేశారు. ర్యాలీల్లో పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

అంతిమయాతన..!



చెరువుకాలువ నీటిలో శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యం

గోరంట్ల, సెప్టెంబరు 16: మండలంలోని పాలసముద్రం గ్రామ ఎస్సీ కాలనీలో ఎవరైనా చనిపోతే.. అంతిమయాత్రకు బెంబేలెత్తుతారు. నడుములోతు చెరువు కాలువ నీటిలోనే అంతిమయాత్రగా శ్మశానానికి వెళ్లాల్సి ఉంటుంది. కాలనీకి చెందిన ఇల్లూరి పెద్ద అంజినప్ప (80) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. శవాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లడానికి బంధువులు నానా తంటాలు పడాల్సివచ్చింది. గతంలో శ్మశానానికి వేరే దారి ఉండేది. అక్కడే నాసిన్, బెల్ పరిశ్రమలు ప్రహరీలు నిర్మించి, ఆ దారిని మూసేశారు. దీంతో కాలనీలోని ప్రైవేటు పాఠశాల వెనుక నుంచి చెరువునీటి కాలువలో దిగి, శ్మశానానికి శవాన్ని తీసుకెళ్లాల్సి వస్తోంది. శవాన్ని నీటిలో తరలించాలన్నా, మహిళలు కాలువ దాటాలన్నా భయంభయంగా వెళ్తారు. తమ బాధను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి, శ్మశానవాటికకు దారి చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కాలువ దాటుతున్న మహిళలు



తీజ్ ఉత్సవాలు ప్రారంభం


సంప్రదాయ వేషధారణలో లంబాడీ మహిళలు

ఉరవకొండ, సెప్టెంబరు16: బంజారాల తీజ్ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండాలో గురునానక్ ఆలయం వద్ద ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బంజారా యువతులు సంప్రదాయ వేషధారణలో గోధుమలు తెచ్చేందుకు బయలుదేరారు. అనంతరం వెదురు బుట్టలో పుట్టమన్ను, ఇసుకను సమకూర్చుకుని గోధుమ విత్తనాలను నాటారు. 11 రోజుల పాటు వాటికి భక్తిశ్రద్ధలతో నీటిని పోస్తారు.

నెలవారీ ఉద్యోగోన్నతులు ఇవ్వాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న సిరాజుద్దీన్

అనంతపురం విద్య, సెప్టెంబరు 16: ఉపాధ్యాయులకు నెలవారీ ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం జోనల్ కార్యదర్శి సతీష్‌కుమార్ అధ్యక్షతన ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండేళ్లుగా నెలవారీ ఉద్యోగోన్నతులు ఇవ్వకపోవడంతో వేలాది ఖాళీలు అలాగే ఉన్నాయన్నారు. మండల స్థాయిలో జరగాల్సిన పని సర్దుబాటు ప్రక్రియను రాష్ట్రస్థాయి అధికారులు ఆధ్వర్యంలో చేయడం వల్ల చాలా మంది ఉపాధ్యాయులు ఆందోళన పడ్డారన్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా అసంబద్ధమైందన్నారు. సర్దుబాటు 8 కిలోమీటర్ల లోపు ఉండాలన్న నిబంధనలను పక్కనబెట్టేసి డివిజన్ పేరుతో సుదూర ప్రాంతాలకు టీచర్లను సర్దుబాటు చేయడంతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. జిల్లా గౌరవ సలహాదారులు వెంకటేశులు, ఉపాధ్యక్షులు బొమ్మయ్య, సతీష్, సర్దార్‌వలి పాల్గొన్నారు.

జీఆర్పీ డీఎస్పీ బదిలీ

గుంతకల్లు, సెప్టెంబరు16: రైల్వే పోలీస్(జీఆర్పీ) డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. జీఆర్పీ డీఎస్పీగా పనిచేస్తున్న షేక్ అబ్దుల్ అజీజ్‌ను ప్రభుత్వం గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్‌కు బదిలీ చేసింది. మంగళవారం ఆయన గుంతకల్లులో రిలీవ్ కానున్నరు.

రేపు మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 16: నగరంలో ఈనెల 18న మూడు అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతూరు గుత్తి రోడ్డులోని అన్న క్యాంటీన్‌తోపాటు రైల్వే స్టేషన్ సమీపంలో, బళ్లారి బైపాస్‌లోని అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే క్యాంటీన్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయన్నారు. పట్టణ ప్రాంతంలోని పేద ప్రజలకు ఆకలి తీర్చేడమే అన్న క్యాంటీన్ల ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో అవసరమైన ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు.

జీడిపల్లికి 1001 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 16: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1001 క్యూసెక్కుల వస్తోందని హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 921 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 50 క్యూసెక్కులు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

జాతీయ పోటీలకు ఎంపిక


ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16: జాతీయ టెన్నికాయిట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 14నుంచి 16వతేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించిన 36వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ సబ్‌జూనియర్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన మహీధర్, జ్యోతిక, దీక్షిత, స్పందన ఈనెల 28వతేదీ నుంచి జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రంగస్వామి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు చెన్నయ్య, పీడీలు వలీ, అమరాంజనేయులు, నాగరాజు, ప్రకాష్ అభినందించారు.

చెస్ టోర్నీలో ఉదయ్‌కుమార్ ప్రతిభ



కేంద్రమంత్రి నుంచి బహుమతి అందుకుంటున్న ఉదయ్‌కుమార్ నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16: ఇంటర్నేషనల్ ఫిడే చెస్ రేటింగ్ టోర్నీలో జిల్లా సీనియర్ క్రీడాకారుడు ఉదయ్‌కుమార్ ప్రతిభను చాటాడు. భీమవరంలో ఆదివారం ఆంధ్రాచెస్ అసోసియేషన్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ బిలో 1600 ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2024లో సుమారు మూడు దేశాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఇందులో జిల్లాకు చెందిన సీనియర్ చెస్ క్రీడాకారుడు ఉదయ్‌కుమార్‌నాయుడు ఫైనల్లో విజేతగా నిలిచి ఓపెన్ క్యాటగిరిలో 14వ స్థానాన్ని సాధించాడు. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా రూ.10వేలు నగదుతో పాటు మెమెంటో అందుకున్నాడు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్‌నాయుడు అభినందనలు తెలిపారు.



అయినా.. వదలరు..!

నష్టాలు వస్తున్నా పెరుగుతున్న టమోటా సాగు

రూ. లక్షలు పెట్టుబడి పెడుతున్న అన్నదాతలు

ప్రభుత్వ రాయితీల కోసం ఎదురుచూపు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: దిగుబడి బాగున్నా ధర లేక వరుసగా నష్టాలు వస్తున్నా రైతులు మాత్రం టమోటా సాగును వీడటం లేదు. ఏడాదిలో ఒక్కసారి సరైన రేటు తగిలితే చాలు మొత్తం కష్టాలు తీరుతాయన్న ఆశతో ప్రతిసారి సాగు చేస్తూనే ఉన్నారు. ఈక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టమోటా సాగు ఏటేటా పెరుగుతూనే ఉంది. పంటసాగుకు ప్రభుత్వం నుంచి సాయం అందితే కాస్త ఊరట ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

వివిధ పద్ధతుల్లో సాగు

ఉమ్మడి జిల్లాలోని రైతులు వివిధ పద్ధతుల్లో టమోటా సాగు చేస్తున్నారు. సాధారణ పద్ధతిలో పంట సాగు చేస్తే వర్షాలకు దెబ్బతింటోదని మల్చింగ్ షీట్, కట్టెల పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఈ పద్ధతుల్లో పంట సాగు చేస్తే వర్షాలకు కాయలు దెబ్బతినకపోవడంతో పాటు నిల్వ కూడా సాధారణం కంటే రెండు మూడు రోజులు అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. మల్చింగ్ పద్ధతిలో పంట కాలం ముగిసినా అదనంగా నెల..కట్టేల పద్ధతిలో రెండు నెలల పాటు దిగుబడులు వచ్చే వీలుంటుందని చెబు తున్నారు. అందుకే ఈపద్ధతుల్లో పంట సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అయితే పెట్టుబడులు కూడా రూ.లక్షల్లోనే అవుతున్నాయి. మల్చింగ్ (పేపర్)పద్ధతిలో ఎకరానికి రూ.50వేల నుంచి రూ.70వేల మధ్య పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మల్చింగ్ తరువాత ఎక్కువగా సాగు చేస్తున్నది కట్టెల పద్ధతి. ఈ పద్ధతిలో పంట సాగుకు ఎకరాకు రూ.లక్ష ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మల్చింగ్, కట్టెల పద్ధతిలో సాగుకు రాయితీలు ఇచ్చే వారని, వైసీపీ పాలనలో వీటన్నింటిని ఎత్తివేసినట్లు రైతులు చెబుతున్నారు. వీటిని పునరుద్ధరిస్తే రైతుకు మేలు జరుగుతుందని వారు పేర్కొంటున్నారు.


కట్టెల పద్ధతిలో సాగు చేసిన టమోటా

■ రాయితీలు ఇస్తే బాగుంటుంది



మల్చింగ్ పద్ధతిలో పంట సాగు చేశా. పంటసాగు మొదలుకొని కోత కొచ్చే సరికి ఎకరానికి రూ.60వేలకుపైగానే పెట్టుబడులు అయ్యాయి. మూడున్నర ఎకరాల్లో పంట సాగు చేశా. పేపర్ రోల్స్, వాటిని పరిచేందుకే రూ.12 వేల వరకు ఎకరానికి ఖర్చు అయింది. ఇలా అన్ని అయ్యే సరికి పెట్టు బడులకే రూ.60వేలకు చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీలిస్తే బాగుంటుంది. టీడీపీ పాలనలో మల్చింగ్ పద్ధతిలో సాగుకు హెక్టార్‌కు రూ.10వేల నుంచి రూ.15వేలు సబ్సిడీ వచ్చేది.

-సంజీవులు, రైతు, ఆలమూరు

■ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కనీస మద్దతు ధరతో టమోటాను ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులకు లాభం చేకూరుతుంది. టమోటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. 90శాతం రాయితీతో స్టేకింగ్ (కట్టేల)పద్ధతి సాగుకు అవకాశం కల్పించాలి. నేల మీద సాగుకు పేపర్ షీట్ అందించాలి. టమోటా మార్కెట్‌లో మండీల పర్యవేక్షణ ప్రభుత్వమే చేయాలి. టమోటా ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. మండీల్లో హమాలీ కూలీ, బాక్సల బాడుగ మండీల నిర్వాహకులే ఇచ్చేవిధంగా చూడాలి.



- చిరుతల మల్లికార్జున, జిల్లాప్రధాన కార్యదర్శి, రైతు సంఘం

ఉపాధికి అనుసంధానించాలి

ఇరవై ఎకరాల్లో టమోటా సాగు చేశా. మల్చింగ్ పద్ధతిలో 15ఎకరాలు, కట్టెల పద్ధతిలో ఐదు ఎకరాల్లో టమోటా సాగు చేశా. కట్టెల విధానంలో పంట కోత కొచ్చే దశలో ఉంది. ఈ పద్ధతి సాగు చేయడానికి ఎకరానికి రూ.80వేలకు పైగా పెట్టుబడి పెట్టా. పంట సాగు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 12సార్లు పురుగు మందులు కొట్టా. ఇప్పటికే ఐదు ఎకరాలకు రూ.5లక్షలు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం ఎరువుల ధరలు పెరిగిపోయాయి. ఈ పంటను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఎరువుల ధరలు తగ్గిస్తే కూడా కొంత వరకు రైతులకు మేలు జరుగుతుంది.

వెంకటరాముడు, రైతు, ఆలమూరు



■ మార్కెట్ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ ఆధ్వర్యంలో టమోటా మార్కెట్ ఏర్పాటు చేయాలి. ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖ సమన్వయంతో టమోటా రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు రైతులకు అవగాహన కల్పించాలి. గతంలో మాదిరిగానే ఉద్యాన శాఖ ద్వారా టమోటా విత్తనాలు అందించాలి. ప్రతి నియోజకవర్గంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి. జ్యూస్ తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, అందుబాటులోకి తీసుకురావాలి. పెట్టుబడుల ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టమోటా కనీసం వారంరోజులు నిల్వ ఉండేవిధంగా నూతన వంగడాలు అందుబాటులోకి తీసుకురావాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం



జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

● మంత్రులు సత్యకుమార్, సవిత


మాట్లాడుతున్న మంత్రి సవిత

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 16: జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారధులని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత పేర్కొన్నారు. జిల్లాకేంద్రం లోని సాయిఆరామంలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులతో పాటు ఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే రాజు, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరై ప్రసంగించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజల పక్షాన పోరాడాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతిజర్నలిస్టుకు అక్రిడిటేషన్ ఇస్తామన్నారు. హెల్త్‌కార్డులకు సంబంధించి సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి, ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహి స్తామన్నారు. పత్రికారంగంలో జవాబుదారి తనం ఉండాలన్నారు. ఏమాత్రం చిత్తశుద్ధి లేని జగన్ తన పాలనా కాలంలో వైద్య కళాశాల నిర్మాణాలను 25శాతం కూడా పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. ఏపీలో 17 వైద్య కళాశాల నిర్మాణాలలో హడావుడి తప్ప చేసిందేమి లేదన్నారు. ఫేజ్-2లో మదనపల్లి, ఆదోని, మార్కాపురం, పులివెందుల, పాడేరు వైద్యకళాశాలలను ప్రారంభించి పనుల పూర్తి చేయకపోవడంతో రాష్ట్రంలోని వైద్య విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జాతీయ వైద్యకమిషన్ బృందం జూన్ 24న కళాశాలను తనిఖీచేసి కళాశాల పనుల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. అసుపత్రుల నిర్మాణంలో మౌలిక వసతులు పెండింగ్‌లో ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేసింద న్నారు. నియామకాలు కూడా చేపట్టక పోవడంతో పులివెందులలో కూడా మెడికల్ కాలేజీలో బోధనా నసిబ్బంది కొరత ఉందని తెలిపారు. వైద్యకళాశాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, జగన్‌ప్రభుత్వం వాటికి ఖర్చుచేసిన నిధులపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, నీవు నీమంది మార్బలంతో చర్చకు రావాలని సవాల్ చేశారు. మరో మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి తెలిసేలా జర్నలిస్టులు కృషి చేయాలన్నా రు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు లోటుపాట్లను కూడా తెలియచేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గతప్రభుత్వం పాలనలో పలుచోట్ల జర్నలిస్టులపై దాడులు జరిగాయని, ఈప్రభుత్వంలో జర్నలిస్టుల రక్షణకు అన్నివిధాలా బాధ్యత తీసుకుంటామన్నారు. మాజీమంత్రి పల్లె మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

తుంగభద్ర గేట్లు మార్చాలి: సీపీఐ

ఉరవకొండ, సెప్టెంబరు 16: శిథిలావస్థకు చేరుకున్న తుంగభద్ర డ్యాం గేట్లన్నీ మార్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంకు సంబంధించి గేట్లు మార్చాలని కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో కమిటీ కూడా ఇదే విషయాన్ని బోర్డుకు స్పష్టం చేసిందని తెలిపారు. ఏ డ్యాం గేట్లు అయిన 45 సంవత్సరాలు మాత్రమే పనిచేస్తాయన్నారు. తుంగభద్ర డ్యాం గేట్లు 70ఏళ్లుగా పనిచేస్తున్నాయని, తుప్పుపట్టినప్పుడు దాన్ని తొలగించి రంగులు వేస్తుండడం వల్ల వాటి మందం తగ్గిందని తద్వారా బలహీనంగా మారాయన్నారు. దీంతో 19వ గేటు కొట్టుకోపోయిందని తెల్చిచెప్పారన్నారు. డ్యాం భద్రత దృష్ట్యా 33గేట్లు మార్చి వాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చాలని ఇందుకు సంబంధించి సమగ్రనివేదిక సీడబ్ల్యూసీకి ఏకే బజాజ్ అందించారన్నారు. 33 గేట్లు ఏర్పాటు చేయాలంటే రూ.264 కోట్లు వ్యయం అవుతుందని నిపుణులు అంచనా వేశారని తెలిపారు. గేటు ఎత్తడానికి, దించడానికి వీలుగా హైడ్రాలిక్ అయిష్ట్ వంటి ఆధునాతన వ్యవస్థ ఏర్పాటు చేయాలంటే అదనంగా మరో వంద కోట్లు వ్యయం అవుతుందన్నారు. ఈనెల 19న జరిగే ఐఏబీ సమావేశంలో చర్చించాలన్నారు. ఈసమావేశాన్ని తూతూమంత్రంగా కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు పారదర్శకంగా చర్చలు జరపాలనానరు. మల్లికార్జున, సుల్తాన్, మల్లేష్, తిప్పయ్య పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య


రాజశేఖర్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు16: మండలంలోని చింతలాంపల్లికి చెందిన రైతు రాజశేఖర్(34) అప్పుల బాధ భరించలేక ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్ తనకున్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసుకుంటుండేవాడు. ప్రస్తుతం మరో 28 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ తదితర పంటలు సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.17.50 లక్షలు అప్పు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట చేతికి దక్కే పరిస్థితి కనిపించట్లేదు. ఈ నేపథ్యంలో అప్పులు ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో వారందరూ నిద్రలో ఉండగా.. పురుగుల మందు తాగాడు. ఆ అలికిడికి మేల్కొన్న కుటుంబీకులు అతడిని వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజశేఖర్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. రైతుకు భార్య గీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమ్మెబాట..

నీటి కోసం జనం వెంపర్లాట..!

- శ్రీరామిరెడ్డి, సత్యసాయి పథకాల బంద్‌తో నీటి కష్టాలు
- పొలాల వద్దకు వెళుతున్న గ్రామీణులు
- వేసవిని తలపిస్తున్న ఎండలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు విఫలం



పీఏబీఆర్ వద్ద బంద్ చేసిన తాగునీటి శుద్ధి కేంద్రం

కూడేరు, సెప్టెంబరు 16: ఉమ్మడి జిల్లాకు తాగునీరు అందించే శ్రీరామిరెడ్డి, సత్యసాయి శుద్ధి కేంద్రాలు బంద్ కావడంతో గ్రామాల్లో ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారు. నీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని 11 రోజులుగా సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. ఉమ్మడి జిల్లాల్లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద దాదాపు 1100 గ్రామాలు, సత్యసాయి తాగునీటి పథకం కింద 1050 గ్రామాలకు నీటి సరఫరా జరిగేది. ఆ రెండు పథకాల్లో పనిచేసే కార్మికులు సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో తాగునీరు దొరక్క అల్లాడిపోతున్నారు. కూడేరు మండలంలో కొర్రకోడు, చోళసముద్రం, నారాయణపురం, జల్లిపల్లి, ముద్దలాపురం, కూడేరు తదితర గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నుంచి ఉరవకొండ నియోజక వర్గ తాగునీటి పథకానికి సరఫరా చేస్తున్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఆ ప్రాజెక్టు కూడా నిలిచిపోయింది. దీంతో ఉరవకొండ నియోజక వర్గ పరిధిలోని గ్రామాలకు కూడా తాగునీటి కష్టాలు తప్పలేదు. పంచాయతీ నుంచి సరఫరా అయ్యే నీరు కరెంటు వచ్చినప్పుడే పట్టుకోవాలని.. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వ్యవసాయ మోటర్లకు కరెంటు వచ్చిన సమయంలో సుదూరంగా ఉన్న తోటలకు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. ప్రజలతోపాటు మూగ జీవాలు కూడా దాహంతో అల్లాడిపోతున్నాయి. తాగునీటి కోసం పనులు వదులుకొని ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నట్లు మహిళలు తెలిపారు. మూగ జీవాల దాహం తీర్చడానికి కిలోమీటర్ల దూరంలోనున్న తోటల్లోకి ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లి తీసుకువస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలను తీర్చడానికి అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయాలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాకాలం వచ్చినా వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. దీంతో నీటి అవసరాలు మరింత ఎక్కువయ్యాయి.



ఎద్దులబండి, సైకిల్‌పై నీటిని తెచ్చుకుంటున్న ముద్దలాపురం గ్రామస్థులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. 12 రోజులుగా వేలాది మంది కార్మికులు వేతనాలు, పీఎఫ్ తదితర సమస్యలపై ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.


-శ్రీనివాసులు, సీఐటీయూ నాయకుడు

క్యాన్సర్ ఆసుపత్రి మంజూరు చేయండి

● మంత్రి సత్యకుమార్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: ఉమ్మడి జిల్లాలో ఇటీవల క్యాన్సర్ బాధితుల ఎక్కువగా కనిపిస్తున్నారని, వారి కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ ఆసుపత్రిని మంజూరు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలో పర్యటించిన మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. మంత్రి దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లారు. జిల్లాకు చెందిన క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం మెట్రో నగరాలకు వెళ్తున్నారని, వైద్యానికి చాలా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా చిన్నపిల్లలకు మెరుగైన వైద్యం కోసం మెట్రో నగరాలకు వెళ్తున్నారని, ఇందుకు సరైన పరికరాలున్న అంబులెన్స్‌లు లేక ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వమే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు.

టమోటా కిలో రూ.35



అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.20పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 26 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 16: పర్యాటక అవార్డుల కోసం 2023-24 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖాధికారి కమతం విజయకుమార్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటక సంబంధిత 38 రకాల విభాగాల్లో 41 అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. www.aptourism.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారంను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన దరఖాస్తులను ఏపీ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు ఈనెల 22వ తేదీలోపు పంపాలన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా గౌని పాతిరెడ్డి



అనంతపురం విద్య, సెప్టెంబరు 16: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా గౌని పాతిరెడ్డిని ఆ సంఘం రాష్ట్ర నాయకులు నియమించారు. సోమవారం ఆయనకు ఆ యూనియన్, రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. కళ్యాణదుర్గం మండలం హుల్లికల్లు ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న గౌనిపాతిరెడ్డిని ఆదివారం విజయవాడలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో నాలుగేళ్ల బెలుగుప్ప మండల అధ్యక్షుడిగా పనిచేశానని, మూడోసారి రాష్ట్ర కౌన్సిలర్‌గా పనిచేస్తున్న తనపై రాష్ట్ర నాయకత్వం మరింత బాధ్యతలు పెంచిందన్నారు. ఉపాధ్యాయులకు చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర కమిటీ తనకు ఈ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 198071

కావలెను

ధర్మవరం పట్టణంలోని ప్రముఖ బ్యాంకు నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డు కావలెను. డ్యూటీ 8 గంటలు. జీతం 10K. సంప్ర.Cell:9381838140.

AJA-198072

SITUATION VACANT

★ అనంతపురంలో సేల్స్‌పర్సన్ అవసరం. ఉద్యోగంలో AP మరియు TS లో విస్తృతమైన ప్రయాణం ఉంటుంది. 9513777350కి కాల్ చేయండి.

AJH-23972

36 లక్షలకే 2BHK

Atp to BKS దేవరకొండ దగ్గర మా నూతన వెంచర్ "శ్రీ పదం-హిల్‌వ్యూ" నందు 36 లక్షలకే 3 సెంట్లలో నిర్మిస్తున్న 2BHK ఇండిపెండెంట్ ఇల్లు. బుకింగ్ కొరకు సంప్రదించండి సెల్: 9515860608, 7396540409.

AJA-KRISHNAMURTHY

VILLA HOUSE FOR SALE

Atp to TDP హైవే రోడ్డుకు, BKS దాటాక, నూతన గేటెడ్ కమ్యూనిటీ నందు 4 సెంట్లలో నిర్మిస్తున్న 2BHK 55 లక్షలు & 3BHK డూప్లెక్స్ విల్లా 55 లక్షలు అమ్మబడును సంప్రదించండి సెల్: 9515860608, 7396540409.

AJA-KRISHNAMURTHY

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926.

AJA-198165

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రక్తం తాగేస్తున్నారు..!

- బ్లడ్ టెస్టుల పేరుతో నిలువు దోపిడీ
- కమీషన్లకు ఆస్పత్రి యజమానుల కక్కుర్తి
- అవసరం లేకున్నా టెస్టులకు రెఫర్
- అనధికార కేంద్రాలపై పర్యవేక్షణ కరువు



కదిరి అర్బన్, సెప్టెంబరు 16 : చిన్న... పెద్ద... పల్లె... పట్టణం... ఆడ.. మగ... అనే తేడా లేకుండా ప్రస్తుతం పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ... ప్రైవేట్ ఆస్పత్రులు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. అయితే కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల లక్షణాలను ఏ మాత్రం విచారించకుండా వెంటనే రక్తపరీక్షలు, మూత్రం పరీక్షలు చేయించుకొని రావాలని సూచిస్తున్నారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే ల్యాబ్‌లు ఉన్నాయి. వాటిల్లో రక్త పరీక్షలు చేయించుకోవడంతో లబ్ధి పొందాలనేది వారి లక్ష్యం. మరి కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులో ల్యాబ్‌లు లేకున్నా... సమీపంలోని ల్యాబ్ సెంటర్లతో ఒప్పందం చేసుకొని.. కమీషన్లు వసూళ్లు చేస్తున్నారు. ఆ ల్యాబ్‌లోనే రక్త పరీక్షలు చేయించుకోవాలని మరీ వైద్యులు సూచిస్తున్నారు. మామూలుగా జ్వరం వచ్చిన మూడు, నాలుగు రోజుల తర్వాతే రక్త పరీక్షలు చేయించుకుంటే ఫలితాలు కచ్చితంగా ఉంటాయి. అయితే కొందరు వైద్యులు.. రోగి వెళ్లిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

● టెస్టుల పేరుతో దోపిడీ

కనీస అర్హత లేనివారుకూడా డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. అర్హతలేనివారు రోగ నిర్ధారణ కేంద్రాలు నిర్వహిస్తూ ముక్కుబడిగా పరీక్షలు చేసి, తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి వైద్య పరీక్షకు అయ్యే ఖర్చులకు సంబంధించి ధరల పట్టిను ఏర్పాటు చేయాలి. అయితే 90 శాతం కేంద్రాల్లో వాటిని ఏర్పాటు చేయలేదు. నిబంధనలు పాటించకుండా... కనీసం అనుమతులు, నాణ్యత ప్రమాణాలు లేకుండా వైద్యపరీక్షలు నిర్వహిస్తూ దందా సాగిస్తున్నారు. ఎక్కువ శాతం ఆసుపత్రులు అనుమతులు లేకుండనే.. ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. వీటిల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండటం లేదు. అధికారులు ఇలాంటి వాటిని గుర్తించినా... సీజ్ చేయకుండా.. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకొంటున్నారు.

● ఇబ్బడి ముబ్బడిగా ల్యాబ్‌లు...

జిల్లా వ్యాప్తంగా రక్తపరీక్ష ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. జిల్లాలో ప్రైవేటు చిన్న, పెద్ద ఆసుపత్రులు, ల్యాబ్‌లు వందల్లో ఉన్నాయి. కొన్ని ఆసుపత్రులకు అనుబంధంగా ల్యాబ్‌లు నిర్వహిస్తుండగా, మరిన్ని చోట్ల సొంతంగా ఏర్పాటు చేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 189 ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఉన్నట్లు సమాచారం. ఇంతకు రెట్టింపు ఆసుపత్రులు, ల్యాబ్‌లు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోకుండా అనధికారికంగా నిర్వహిస్తున్నారు. అధిక శాతం ల్యాబ్‌లో వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన నియమాలు పాటించడం లేదు. అధికారులు తనిఖీలు నామమాత్రంగా ఉండడంతో ల్యాబ్‌ల నిర్వాహకులు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

● ల్యాబ్‌ల్లో అనర్హులు

చిన్నపాటి ల్యాబ్‌లు సైతం కనీసం ఎంబీబీఎస్ అర్హతకలిగిన వైద్యులు పర్యవేక్షణ ఉండాలి. పెద్దస్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలంటే పాథాలజిస్టు, రెడియాలజిస్టు, మైక్రోబయాలజిస్టు తదితర అర్హతలు గల వైద్యులుండాలి. వీరికి సహాయకులుగా ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాలి. ల్యాబ్ నిర్వాహణకు డిప్లొమా, డిగ్రీ కోర్సులు పూర్తిచేసి ఉండాలి. అయితే జిల్లాలో చాలా చోట్ల ప్రైవేటు ఆసుపత్రులకు అనుబంధంగా పలు ల్యాబ్‌లను ఆసుపత్రుల వైద్యుల పేరుతో ఇతర వ్యక్తులు నిర్వహిస్తున్నారు. టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన వ్యక్తులు ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు.

● పట్టించుకోని అధికారులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ల్యాబ్‌ల్లో నిబంధనలు పాటించడం లేదు. ఎక్కడబడితే అక్కడ ఇరుకు గదులో, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. ధరల పట్టికలను ఏర్పాటు చేయడం లేదు. కొన్ని ల్యాబ్‌ల్లో అసలు ఏ డాక్టర్ పరీక్ష సేవలందిస్తారో అనే వివరాలు ఉంచడం లేదు. సరిపడ ఫర్నీచర్, తాగునీరు, మూత్రశాల, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలూ ఉండటం లేదు. అయినా ఈ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నారు. వివిధ ల్యాబ్ టెస్టులకు సంబంధించి సరైన బిల్లులు ఇవ్వకుండా దోపిడీ చేస్తున్నారు.



కదిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఓపీ వద్ద రోగులు

చర్యలు తీసుకుంటాం



ప్రైవేటు రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలి. అధిక ఫీజులు వసూలు చేయకూడదు. కనీస సౌకర్యాలు ఉండాలి. తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



సంధ్యాను అభినందిస్తున్న పరిటాల శ్రీరామ్

జూడో క్రీడాకారిణికి అభినందన

ధర్మవరం, సెప్టెంబరు 16: చెన్నైలోని జవహార్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈనెల 12న జరిగిన ఖేలో ఇండియా జూడో సౌత్ జోన్ సెలెక్షన్స్‌లో ధర్మవరం విద్యార్థిని గవ్వల యువ సంధ్యా ప్రతిభ చూపి గుజరాత్‌లో జరిగే ఆలిండియా టోర్నీకి ఎంపికైంది. దీంతో సోమవారం గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో గవ్వల యువసంధ్యాను తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, చేనేత ప్రముఖులు సంధ రాఘవ, మాంగళ్య శిల్క్ జింకా పురుషోత్తం అభినందించారు. భవిష్యత్తులో తన వంతు సహాయసహకారాలు అందిస్తామని ఆ విద్యార్థికి భరోసా ఇచ్చారు.

మానవహక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న విజయభారతి

కదిరి అర్బన్, సెప్టెంబరు 16 : మానవహక్కులపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టు ఛైర్‌పర్సన్ విజయ భారతి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పార్థ సారధి నివాసంలో మానవహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో కోట్లాదిమంది జీవించే హక్కును పొందలేకపోతున్నారని, హక్కులు హరించినట్లు ఎవరైనా భావిస్తే తమను ఆశ్రయించాలని సూచించారు.కార్యక్రమంలో బీజేపీనాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కదిరి, సెప్టెంబరు 16 : కదిరి డీఎస్పీగా శివనారాయణ స్వామి సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ శ్రీలత తిరుపతి మహిళ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న శివనారాయణస్వామిని ఇక్కడ నియమించారు. నూతన డీఎస్పీ.. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



మండల పశువైద్యాధికారిగా ధనుంజయ్

కదిరి, (అమడగూరు) : మండల పశువైద్యాధికారిగా ధనుంజయ్ సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను నంద్యాల జిల్లా ఆర్లగడ్డ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. రెండు సంవత్సరాలుగా తనకల్లు మండల పశువైద్యాధికారి హరినాథ్‌రెడ్డి ఈ మండలానికి ఇన్‌చార్జీగా విధులు నిర్వహిస్తున్నారు.

సదరం క్యాంపు తేదీల్లో మార్పు

కదిరి అర్బన్, సెప్టెంబరు 16: కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించాల్సిన సదరం క్యాంపు తేదీల్లో మార్పు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కంటి డాక్టర్ అత్యవసర పరిస్థితుల్లో సెలవు పెట్టడంతో ఈ సదరమ్ క్యాంప్ 20వ తేదీకి మార్చినట్లు చెప్పారు. ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక చేయూత

తనకల్లు, సెప్టెంబరు 16 : మండలంలోని రతినేనాయక్ తండాకు చెందిన కోమల.. విట్ ఏపీ యూనివర్సిటీలో బీటెక్ ఇంజనీరింగ్ చదువుతోంది. యూనివర్సిటీలో కచ్చితంగా ల్యాప్‌టాప్ ఉండాలని నిబంధన ఉండటంతో కోమలా దాన్ని కొనే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టరీ ఆఫ్ హోమ్ అఫైర్ బోర్డు సభ్యుడు ముక్తియార్ బాషా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆమెకు ల్యాప్‌టాప్‌తో పాటు మెస్ చార్జీల కోసం రూ.90 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందచేశారు.

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ

నల్లమాడ, సెప్టెంబరు 16 : మండలంలోని శీకివారిపల్లికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వరద బాధితుల కోసం బియ్యం సేకరించారు. సోమవారం ఆ గ్రామంలో ఇంటింటికి తిరిగి బియ్యాన్ని సేకరించారు. ఆ బియ్యన్ని మండల కేంద్రంలోని మైలే శివశంకర్ నివాసంలో అందచేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, చిన్నప్పరెడ్డి, చిన్న వెంకటరమణ, పెద్ద వెంకటరాముడు పాల్గొన్నారు.

ఉన్న మరువ తొలగించారు..!

- అధికారుల్లో అవగాహనారాహిత్యం
- తిరిగి నిర్మించకుండా నిర్లక్ష్యం



మరువను తొలగించిన ప్రాంతం

తాడిమర్రి, సెప్టెంబరు 16 : ఇరిగేషన్ అధికారుల అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యం వల్ల రెండేళ్ల రైతులు సాగునీటిని నష్టపోతున్నారు. తాడిమర్రి పడమటి చెరువును శతాబ్దాల క్రితం రాజులు నిర్మించారు. మరువను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల పీఏబీఆర్ కుడికాలువ ద్వారా పడమటి చెరువుకు అధికారులు నీరు తెచ్చారు. ఆ నీటిని తూర్పుచెరువుకు కూడా తీసుకెళ్లానే ఉద్దేశంతో పడమటి చెరువు మరువను అధికారులు తొలగించారు. దీంతో పడమటి చెరువుకు పూర్తి స్థాయిలో చేరకుండానే తూర్పుచెరువుకు నీరు వెళ్లిపోయింది. దీంతో రెండేళ్లుగా సాగునీరు వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు. తిరిగి నిర్మిస్తామని అధికారులు చెప్పినా.. ఇంతవరకు ఎవరు పట్టించుకోలేదు. ఈ వర్షాకాలంలోనైనా మరువను తిరిగి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని..లేకుంటే ఈ సారీ వర్షపు నీరు వృథా అవుతుందని రైతులు కోరుతున్నారు.

బాలికపై అత్యాచారయత్నం

రొద్దం : మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచార యత్నం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామంలో కార్తీక్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారయత్నానికి పాల్పడినట్లు సమాచారం. రొద్దం ఎస్‌ఐ వలీబాషా మాట్లాడుతూ.. బాలికను ర్యాగింగ్ చేశాడని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలపడంతో విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా మంత్రి సత్యకుమార్ పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్

ధర్మవరం, సెప్టెంబరు 16 : రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి కేక్‌కట్ చేశారు. అదేవిధంగా బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి మంత్రి సర్టిఫికెట్లు అందజేశారు.

ఎన్డీఏ కార్యాలయ ప్రారంభం

పట్టణంలోని మార్కెట్‌యార్డ్ ఎదురుగా ఎన్డీఏ కార్యాలయాన్ని మంత్రి సత్య కుమార్‌యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డితో కలిసి సోమవారం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీశ్, గుండాపుల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న అటల్ బిహారీ వాజపేయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ముగింపు రోజు జరిగిన ఫైనల్‌లో స్టార్-11, ఇండియన్ 11 జట్టు తలపడగా... ఇండియా 11 జట్టు విజయం సాధించింది. విన్నర్స్ జట్టుకు రూ.లక్ష, రన్నర్స్ జట్టుకు రూ.50 వేలు మంత్రి సత్యకుమార్, ఆర్డీటీ ఛైర్మన్ మాంచో ఫెర్రర్ అందజేశారు.

వరద బాధితులకు చేయూత

ధర్మవరం, సెప్టెంబరు 16 : విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు స్థానిక దుకాణాల్లో విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళం రూ.50వేలను చెక్కు రూపంలో సోమవారం బీజేపీ కార్యాలయం వద్ద ఆ కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి మంత్రి సత్యకుమార్‌కు అందజేశారు. విద్యార్థినులు విరాళాలను సేకరించడాన్ని మంత్రి అభినందించారు.

రూ.2 లక్షలు విరాళం

విజయవాడ వరద బాదితులకు ధర్మవరం పట్టణానికి చెందిన జాతీయ చేనేత నాయకురాలు జయశ్రీ, ఆమె భర్త విశ్రాంత కంటి వైద్యనిపుణుడు నరసింహులు రూ.2 లక్షల చెక్కును మంత్రి సత్యకుమార్‌కు సోమవారం అందజేశారు. మంత్రి సత్యకుమార్ జన్మదిన సందర్భంగా ఆయన చిత్రాన్ని డ్రాయింగ్ వేసి ఆ దంపతులు అందజేశారు.





మంత్రి సత్యకుమార్‌కు చెక్‌ను అందజేస్తున్న డోలా పెద్దిరెడ్డి, జయశ్రీ, నరసింహులు దంపతులు

కుక్కల నుంచి కాపాడండి..!



నల్లమాడ బస్టాండ్ సమీపంలో ఉన్న వీధి కుక్కలు

నల్లమాడ, సెప్టెంబరు 16: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రధాన రహదారిల్లో కుక్కలు గుంపులు.. గుంపులుగా ఉంటూ స్థానికులపై దాడులు చేస్తున్నాయి. బస్టాండ్ కూడలి సమీపంలో ఎప్పుడూ 10 నుంచి 15 కుక్కలు ఉంటున్నాయి. అవి బస్టాండ్ నుంచి వెళ్లే ప్రయాణికులపై దాడి చేస్తూ.. గాయపరుస్తున్నాయి. ఇలా కుక్కల గాట్లతో కొంతమంది. వాటి బారి నుంచి తప్పిం చుకోవాలని యత్నిస్తూ కింద పడి గాయపడ్డ మరికొంత మంది ఆస్పత్రి పాలు అవుతున్నాయి. ఇలా అనేక మంది కాళ్లు, చేతులు విరగొట్టుకొని.. ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో కుక్కలు మరీ ఎక్కువగా దాడులు చేస్తున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనా జనం భయప డుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో చెరువులు

ఐదేళ్లుగా మరమ్మతులు కరువు.. నిర్వహణ శూన్యం

గాండ్లపెంట, సెప్టెంబరు 16 : మండలంలో ఉన్న 56 చెరువులూ శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి చెరువులో.. కట్టలపైన పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు, కట్ట పగుళ్లు, రంధ్రాలు తదితర వాటికి మరమ్మత్తులు చేయాల్సి ఉంటుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో ఏ చెరువునూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో చెరువు.. కట్టలపైన ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండడంతో ఎలుకలు రంధ్రాలు పెట్టాయి. దీంతో వర్షాలు వస్తే.. నీరు వృథా అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనిపై ఇరిగేషన్ జేఈ అరుణకుమారిని వివరణ కోరగా.. చెరువుల మరమ్మత్తులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మత్తులు చేస్తామని తెలిపారు.



పొరెడ్డివారిపల్లి చెరువులో ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు, చెరువు కట్టపై భారీగా ఉన్న ముళ్ల కంపలు (ఇన్‌సెట్లో)

ఘనంగా మిలాద్- ఉన్ - నబీ

కదిరి అర్బన్, సెప్టెంబరు 16: మిలాద్-ఉన్-నబీ పండుగను పరష్కరించుకుని పట్టణంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, కేఎస్ బాహుద్దీన్, డైమండ్ ఇర్ఫాన్, అల్ఫాముస్తఫా, ఇదాయత్, కటిక ఖదర్‌బాషా, మత పెద్దలు సయ్యద్ ఉబేదుల్లా, అబీబుల్లా, షామీర్‌బాషా, అన్సర్‌బాషా, మిలాద్- ఉన్, న బీ కమిటిసభ్యులు జంషీద్, మగ్బుల్అలీఖాన్, నిజాం, తుమ్మల అలియాజ్ పాల్గొన్నారు. అలాగే మెప్మా అధ్యక్షుడు ఖాదర్‌బాషా కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పురిటి పిల్లలకు దుస్తులు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు అందచేశారు. ఇందులో మెప్మా కమిటీ సభ్యుల చాంద్‌బాషా సాధిక్, ఇర్ఫాన్, ఇమ్రాన్, సోఎల్ పాల్గొన్నారు. అలాగే ఓబుళదేవరచెరువు, తనకల్లులో శాంతి ర్యాలీ నిర్వహించారు. గాండ్లపెంటలో జీన్లకుంట దర్గా వద్ద ఖురాన్‌ను పఠించారు. మహమ్మద్‌ప్రవక్త సూక్తులను మత పెద్దలు వివరించారు. పలువురికి అన్నదానం నిర్వహించారు.



కదిరి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

వైభవంగా ఉయ్యాలోత్సవం



హిందూపురం : పట్టణంలోని నానెప్ప నగర్‌లో వెలసిన అనంతపద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి ఉయ్యాలోత్సవం వైభవంగా జరిగింది. అనంత చతుర్దశి ని పురస్కరించుకుని అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, సామూహిక అనంత వ్రతం, మహానారాయణహోమం, స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి ఉయ్యాలోత్సవం, ముత్యపు పుష్పాలు, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు.



వాసవీ కల్యాణ మండపం సమీపంలో పడేసిన చెత్త

ముదిగుబ్బా... చెత్త దిబ్బా..!

ముదిగుబ్బ, సెప్టెంబరు 16: ముదిగుబ్బలో పారిశుధ్యం పడకేసింది. చెత్త ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. రహదారి పక్కన వాసవీ కళ్యాణ మండపం పరిసరాలు, ఆర్డీటీ కార్యాలయం ఎదుట, కదిరి రోడ్డు రైల్వేగేట్ సమీపంలోని ప్రాంతాలలో, రోడ్డు పక్కన సంచులతో తీసుకువచ్చి చెత్తను పడవేస్తున్నారు. అలాగే పలు వీధులలో చెత్త పేరుకుపోయింది. వాటి కోసం వచ్చిన పందులు, కుక్కలు రోడ్లపై అడ్డంగా తిరుగుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పందులు అధకంగా ఇళ్ల మధ్య సంచరిస్తుండటంతో స్థానికులు పలు రోగాల బారిన పడుతున్నారు. చెత్త మురిగిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, ఆ కంపు భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో దోమలు అధికమై దాడులు చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పక్కన చెత్తను తొలగించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వాసవీనగర్‌లో చెత్తలో సంచరిస్తున్న పందులు

వైభవంగా ఉయ్యాలోత్సవం


అలంకరణలో అనంత పద్మనాభస్వామి

హిందూపురం, సెప్టెంబరు 16: పట్టణంలోని నానెప్పనగర్‌లో వెలసిన అనంతపద్మనాభస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి ఉయ్యాలోత్సవం వైభవంగా జరిగింది. అనంత చతుర్దశి ని పురస్కరించుకుని అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, సామూహిక అనంత వ్రతం, మహానారాయణ హోమం, స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి ఉయ్యాలోత్సవం, ముత్యపు పుష్పాలు, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు.


స్వామివారికి సమర్పించేందుకు తెచ్చిన పుష్పాలు

నంది విగ్రహం వితరణ


నంది విగ్రహాన్ని అందిస్తున్న రిటైర్డ్ పీఈటీ

హిందూపురం, సెప్టెంబరు 16: ఆటోనగర్‌లోని భగీరథ శివాలయానికి రిటైర్డ్ పీఈటీ ఈశ్వరప్ప నంది విగ్రహాన్ని వితరణగా అందించారు. ఉప్పర సగర అభివృద్ధి కమిటీ నాయకులకు ఈ విగ్రహాన్ని అందించారు. కార్యక్రమంలో ఉప్పర సగర నాయకులు రామప్ప, నరసింహప్ప, ఎల్ఐసీ కదిరప్ప, నారాయణ స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం


అన్నదానం చేస్తున్న వేణుగోపాల్‌రావు

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 16: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా బీజేపీ మండల నాయకులు సోమవారం వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో తిరుమల లేఅవుట్‌వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రిగా స్థానం దక్కించుకున్న సత్యకుమార్ యాదవ్ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పరిగి మండల కూటమి నాయకుల తరుపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22న ఉచిత వైద్య శిబిరం

గోరంట్ల, సెప్టెంబరు 16: పట్టణంలోని శ్రీవాసవి మహల్‌లో ఈనెల 22న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బలరాం గుప్త తెలిపారు. వెంకటలక్ష్మమ్మ, నూకల ఈశ్వరయ్యగుప్త చారిటబుల్ ట్రస్టు ఆర్థికసాయంతో బెంగుళూరు ఆస్టర్ ఆసుపత్రి వైద్యులతో ఉచిత చికిత్సలు అందిస్తారు. గుండె, నరాలు, ఎముకలు, కంటి, మహిళల సంబంధిత, ఈఎన్‌టీ, సాధారణ జబ్బులకు చికిత్సలు చేస్తారన్నారు. శిబిరంలో చికిత్స పొందదలచినవారు ముందుగానే పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఇందుకోసం సెల్‌నెంబర్లు 9490894601, 9440096416, 9441764145కు సంప్రదించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, సెప్టెంబరు 16: మండలంలోని గుమ్మయ్యగారిపల్లికి చెందిన రంగనాథ్ కుటుంబ కలహాల కారణంగా క్రిమిసంహారక మందు తాగి సోమవారం ఆత్మహత్యకు యత్నించారు. వెంకటేష్ కుమారుడైన రంగనాథ్ దంపతుల మధ్య వివాదంతో తీవ్ర మనస్థాపంతో క్రిమిసంహారక మందు సేవించాడు. వెంటనే బంధువులు గుర్తించి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ వైద్య చికిత్సలు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

హిందూపురం (పరిగి), సెప్టెంబరు 16: మండలంలోని ఊటకూరు గ్రామ దళిత కాలనీకి చెందిన మూగమ్మగారి అంజినమ్మ(56) ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఏఎస్ఐ జయలలిత తెలిపిన వివరాల మేరకు.. పశువుల పాక నుంచి బాత్రూమ్‌కు విద్యుత్ లైను తీసుకోవడంతో సిల్కువైరు తెగి ఇనుపకడ్డీ మీద పడింది. ఆమె మనవడు ఈశ్వర్ రాడ్‌ను తాకి షాక్‌కొట్టి అరవడంతో అక్కడే ఉన్న అంజినమ్మ, మనవడిని కాపాడే క్రమంలో కరెంటు షాక్ కొట్టి స్పృహ కోల్పోయింది. మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

రొద్దం, సెప్టెంబరు 16: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడురోజుల క్రితం మండలంలోని ఓ గ్రామంలో కార్తీక్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారానికి యత్నించినట్లు సమాచారం. ఈ విషయంపై రొద్దం ఎస్ఐ వలీబాషా మాట్లాడుతూ.. బాలికను ర్యాగింగ్ చేశాడని బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు తెలపడంతో విచారణ చేస్తున్నామని తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 16 : అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని సీఐటీయు జిల్లా కోశాధికారి సాంబశివుడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమందేపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 104 సిబ్బంది శ్రీరాంరెడ్డిని ఆత్మహత్యకు ప్రేరేపించిన ఓయీ రామక్రిష్ణపై చర్యలు తీసుకోవాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేధింపులు ఆపకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కదలని 108 వాహనం..!



మరమ్మతులకు గురైన 108 వాహనం

గుడిబండ, సెప్టెంబరు 16: నెలరోజుల నుంచి 108 వాహనం కదలకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుడిబండ పీహెచ్‌సీకి కేటాయించిన 108 వాహనం మరమ్మతులకు గురై కదలకపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడి ఆటోలు, ద్విచక్రవాహనాలను ఆశ్రయిస్తున్నారు. సకాలంలో వైద్య సేవలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని నిలిచిపోయిన 108 వాహనానికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

పలు గ్రామాల్లో కొలువుదీరిన వినాయకుడిని సోమవారం ఘనంగా నిమజ్జనం చేశారు. రొద్దంలో 21అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఊరేగింపు అనంతరం రొద్దం పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. మడకశిర మండలం నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో పాల్గొన్నారు. మడకశిర పట్టణంలో ఏర్పాటు చేసిన 18 బొజ్జగణపయ్యలను నిమజ్జనం చేశారు. అభయ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పూజలు నిర్వహించారు.

\- న్యూస్ నెట్‌వర్క్


మడకశిర రూరల్: వినాయక విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేసేందుకు తీసుకువచ్చిన గ్రామస్తులు


రొద్దం: వినాయక పూజల్లో పాల్గొన్న ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ నాయకులు


మడకశిరలో గుండుమల తిప్పేస్వామి తదితరులు


నీలకంఠాపురంలో వినాయక నిమజ్జనంలో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి

వేలుపుకొండ క్వారీని రద్దుచేయాలి

● మంత్రి సవితకు విన్నవించిన రైతులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 16: వేలుపుకొండపై తమ ఆరాధ్య దైవమైన అక్కమ్మగార్లు ఉన్నారని, అక్కడ కొండలో క్వారీని రద్దు చేయాలని మంత్రి సవితకు పాపిరెడ్డిపల్లి, నాగినాయని చెరువు తండాకు చెందిన రైతులు విన్నవించారు. సోమవారం మంత్రి సవితను వారు కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగినాయనిచెరువుతండాలో వంద ఇళ్లు ఉండగా 300ఎకరాల్లో పంట పొలాలున్నాయన్నారు. వేలుపుకొండపై తమ ఆరాధ్య దైవమైన అక్కమ్మగార్లు ఉన్నారని, గత పదేళ్లుగా కొండలో క్వారీ నిర్వహిస్తున్నారని తెలిపారు. బండలను పేలుస్తుండటంవల్ల కొండపై వెలసిన అక్కమ్మగార్ల గుడికి దారి మూసుకుపోయిందన్నారు. అదేవిధంగా గ్రామంలోని పంట పొలాల్లో తెల్లటి దుమ్ము పరుచుకోవడంతో బీళ్లుగా మారిపోయాయన్నారు. మిద్దెలు పేలుళ్లధాటికి నెర్రెలు చీలాయని వివరించారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. మీరైనా స్పందించి వేలుపుకొండను కాపాడాలని, కొండ ప్రాంతంలో క్వారీని రద్దుచేయించి తమ ఆరాధ్య దైవాన్ని, గ్రామాన్ని రక్షించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు. మంత్రి సవిత మాట్లాడుతూ తాను విజయవాడకు వెళ్తున్నానని తెలిపారు. వచ్చిన వెంటనే మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గ్రామస్థులు డీవీ ఆంజనేయులు, శంకర్‌నాయక్, సోమునాయక్, బీమ్లానాయక్, లక్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి సమస్యను వివరిస్తున్న రైతులు

ఉపాధి కల్పించడమే లక్ష్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి


యువతికి నియామక పత్రం అందజేస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, సెప్టెంబరు 16: రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, అందులో భాగంగానే పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. అమర్‌రాజా కంపెనీవారు నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో 160 మంది యువతీ యువకులను ఎంపిక చేసుకొని వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే పారిశ్రామిక రంగంతోనే సాధ్యపడుతుందన్నారు. మడకశిర నియోజకవర్గంలో సైతం ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిలతో నియోజకవర్గంలో పరిశ్రమల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని, భవిష్యత్తులో మంచి కంపెనీలు మడకశిర ప్రాంతంలో ఏర్పడనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అమర్‌రాజా కంపెనీవారు నిర్వహించిన జాబ్‌మేళాలో 160 మంది ఎంపికకాగా వారికి నియామక పత్రాలను కంపెనీ ప్రతినిధులతో కలిసి అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, అమర్‌రాజా కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.

కోనాపురంలో తాగునీటికి కటకట

● మూడేళ్లుగా పట్టించుకోని అధికారులు
● ఆందోళనలో గ్రామస్థులు


కొళాయి వద్ద నీటి కోసం వేచి ఉన్న మహిళలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 16: బిందెడు నీటి కోసం పనులు వదులుకుని కొళాయివద్ద గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి దాపురించిందని పెనుకొండ మండలం కోనాపురం గ్రామ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన మూడేళ్లుగా తాగునీటి సమస్య తీర్చాలని అధికారులకు, పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. కోనాపురంలో 400 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రెండు వేలకుపైగా జనాభా ఉంది. గ్రామానికంతా మూడు బోరుబావులు ఉన్నాయి. అందులో వచ్చే అరకొర నీరు గ్రామానికి సరిపోకపోవడంతో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. కొళాయిల వద్ద వచ్చే అరకొర నీటి కోసం పనులు వదులుకుని కొళాయిలవద్ద కాపుకాసే పరిస్థితి ఉందని గ్రామంలోని మహిళలు వాపోతున్నారు. ఒక్కోసారి బోరుబావులు మరమ్మతులకు గురైనప్పుడు వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామాన్ని వెంటాడుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీటి సమస్య తీర్చాలి: పార్వతమ్మ, కోనాపురం



గత మూడేళ్లుగా మా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పండగ వచ్చిందంటే తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. గ్రామంలో వచ్చే అరకొర నీటి కోసం కొళాయిలవద్ద పనులు వదులుకుని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి.

చర్యలు తీసుకుంటాం : శ్రీనివాసులు, కమిషనర్

కోనాపురంలో తాగునీటి సమస్య ఉందని మా దృష్టికి రాలేదు. నేను ఇటీవలే పెనుకొండలో విధులు చేపట్టాను. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో ప్రతి గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు చేపడతాం.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వం నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 16: బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా కొనసాగిస్తున్నారు. సోమవారం సడ్లపల్లి 14వ వార్డు ప్రాంతంలో బీజేపీ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్ కుమార్, వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పెంచేలా నాయకులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజినరెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్, బద్రి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తూమకుంటలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా దీనికి ముఖ్య అతిథిగా జిల్లా సభ్యత్వ ప్రముఖ్ రమణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ పాల్గొన్నారు.

కొండలు పిండి..!

● మట్టికోసం బరితెగింపు
● చోద్యం చూస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 16: మట్టి మాఫియా బరితెగించి పేట్రేగిపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. పెనుకొండ-సోమందేపల్లి మండలాల్లో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరిపోయాయి. రియల్టర్లు భూమి చదునుకు ఎక్స్‌కవేటర్లు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి కొండలను పిండి చేస్తున్నారు. పెనుకొండ మండలానికి సోమందేపల్లి సరిహద్దు ప్రాంతమైన పరమేశ్వరిపురం, అక్కమ్మగార్ల కొండను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అక్కమ్మగార్ల కొండ ఉండటంతో ఆ ప్రాంతంలోని కొందరు విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నారు. దీనికి కొందరు నాయకుల అండదండలున్నాయన్న విమర్శలు ఉన్నాయి. శని, ఆది, సోమవారాలు మూడు రోజుల నుంచి సెలవు ఉండటంతో మట్టిమాఫియా బరితెగించింది. ఇప్పటికైనా అధికారులు అడ్డుకట్ట వేయకపోతే రెవెన్యూ కొండలు కరిగిపోతాయని ప్రజలు అంటున్నారు.


అక్కమ్మగార్లగుట్టను తవ్వేసిన దృశ్యం

చర్యలు తీసుకుంటాం : శ్రీధర్, తహసీల్దార్

అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటాం. మట్టి తరలింపునకు అనుమతులు తప్పనిసరి. అక్రమంగా తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

కట్నం వేధింపులు భరించలేక ఆత్మహత్య

అనంతపురం క్రైం, సెప్టెంబరు 16: కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని నాలుగో రోడ్డుకు చెందిన లాకే అనితకు అదే కాలనీలో నివాసముంటున్న లాకే బాలాజీతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో కట్న కానుకల కింద 10 తులాల బంగారం, ఐదు సెంట్ల స్థలాన్ని అతడికి ఇచ్చారు. వారికి కుమారుడు ప్రత్యూష్, కుమార్తె దీక్షిత సంతానం. పెళ్లయిన రెండేళ్ల నుంచి భర్త బాలాజీ, అత్త హైమావతి, మామ పెద్దముని అదనపు కట్నం కోసం అనితను వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టారు. వేధింపులు భరించలేక ఆమె మనస్తాపానికి గురైంది. సమీప బంధువు మృతి చెందడంతో కుటుంబసభ్యులు మూడో రోడ్డుకు వెళ్లడంతో అని సోమవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని త్రీటౌన్ సీఐ శాంతి లాల్ తెలిపారు. మృతురాలి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ

మహ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనిద్దామని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. సోమవారం మిలాద్ ఉన్ నబి సందర్భంగా పలుచోట్ల ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూపురం పట్టణంలోని మేళాపురం, ముక్కడిపేట, రహమ్‌పురం, జామియా మసీదు, ఆలెహదీస్ మసీదు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ యువకుడు గుర్రంపై చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పెనుకొండ పట్టణంలో వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. జామియా మసీదు నుంచి బాబయ్య దర్గా వరకు ప్రవక్త ప్రవచనాలు వల్లిస్తూ దర్గా చేరుకుని సమాధికి చాదర్ సమర్పించారు. ఖాజా గరీబ్‌నవాజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అదే విధంగా అగళి, మడకశిర, పావగడ పట్టణాల్లో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

\- న్యూస్ నెట్‌వర్క్


హిందూపురం : ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


అమరాపురం: ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

